

అర్హులకు ఇళ్ల స్థలాలివ్వాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - తణుకు

తణుకు నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఆర్అండ్బి రహదారులు అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించి సత్వరం చర్యలు తీసుకోవాలని శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక క్యాంపు కార్యాలయం వద్ద ఇరిగేషన్, ఆర్అండ్బి అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల్లోని ఆర్అండ్బి రహదారులకు సత్వర మరమ్మత్తులు చేయాలని ఆదేశించారు. అనంతరం గత వైసిపి ప్రభుత్వంలో మంజూరు చేసిన ఇళ్లకు సంబంధించిన బిల్లులు పెండింగ్లో ఉన్న వాటిని త్వరగా రెక్టిఫై చేసి వారికి బిల్లులు అందిచేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

కుండపోత..

అల్పపీడన ప్రభావంతో జిల్లాలో కుండపోత వర్షం కురిసింది. గురువారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకూ ఈదురుగాలులు ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో జనజీవనం స్తంభించింది. సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం, చేతివృత్తిదారులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు ఇంటికే పరిమితమయ్యారు. ఇప్పటికే కురుస్తున్న వర్షాలకు కంటిమీద కునుకు లేకుండా ఉన్న రైతాంగాన్ని భారీ వర్షం నట్టేట ముంచింది. వరినాట్లు, నారుమడులు చెరువులను తలపిస్తున్నాయి. రహదారులు జలమయమయ్యాయి. రహదారులన్నీ మోకాళ్లలోతు నీటిలో మునిగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే అల్పపీడనం మరో రెండు రోజులు కొనసాగుతుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



తాడేపల్లిగూడెంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

స్తంభించిన జనజీవనం
చెరువులను తలపిస్తున్న వరినాట్లు, నారుమడులు
సార్వా ప్రారంభం నుంచి అన్నీ అడ్డంకులే
రహదారులన్నీ జలమయం.. వాహనదారుల అవస్థలు

ప్రజాశక్తి - భీమవరం

అల్పపీడన ప్రభావంతో జిల్లాలో గురువారం ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు ఏకధాటిగా వర్షం కురుస్తూనే ఉంది. జిల్లా కేంద్రమైన భీమవరంతోపాటు వీరవాసరం, పాలకోడేరు, నరసాపురం, తణుకు, పాలకొల్లు, ఆచంట, యలమంచిలి, కాళ్ల, ఆకివీడు, ఉండి, ఇరగవరంల్లో భారీ వర్షం కురిసింది. వ్యాపార సంస్థలు మూసివేయడంతో రహదారులన్నీ వెలవెలబోయాయి. భీమవరం బస్టాండ్ ప్రాంతం, ప్రకాశంచౌక్, పాత బస్టాండ్ సెంటర్, మావుళ్లమ్మ గుడి, జువ్వలపాలెం, ఉండి రోడ్డు, పాలకొల్లు, నరసాపురం, తాడేపల్లిగూడెం రహదారులపై మోకాలి లోతు నీరు చేరింది. భీమవరంలో విజయలక్ష్మి థియేటర్ సమీపంలో ఉన్న అండర్పాస్, మెంటేవారితోటకు వెళ్లే అండర్పాస్, గునుపూడిలోని అండర్ పాస్ల్లో వర్షం నీరు నిలిచిపోయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలు ప్రాంతాల్లో వృక్షాలు నేలకొరగడంతోపాటు విద్యుత్ తీగలు తెగి పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

ముంపులో 780 హెక్టార్లలో నాట్లు, 152 హెక్టార్లో నారుమడులు

జిల్లావ్యాప్తంగా 2.11 లక్షల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ సాగు ప్రారంభించారు. దీనికి 10,500 ఎకరాల్లో నారుమడులు పోశారు. ఇప్పటి వరకూ జిల్లావ్యాప్తంగా 35 వేల ఎకరాల్లో వరినాట్లు వేశారు. ఇంకా లక్షా 70 వేల ఎకరాల్లో నాట్లు వేయాల్సి ఉంది. నాట్లు, నారుమడులు సైతం భారీవర్షానికి నీట మునిగాయి. జిల్లావ్యాప్తంగా 780 హెక్టార్లలో వరినాట్లు, 152 హెక్టార్లలో నారుమడులు నీట మునిగినట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు తెలిపారు. అయితే నీటిలోనే నాట్లు, నారుమడులు ఉంటే కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక ఆక్వా సాగు కూడా ప్రశ్నార్థకంగా మారింది. వర్షం మరో రెండు రోజులు కొనసాగితే రొయ్యలు చనిపోయే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు.

అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించాం
జెడ్.వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ జెడి

ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ముంపుబారిన పడిన వరి చేలకు సంబంధించి అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించాం. జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 35 వేల ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి. ప్రభుత్వం ఆదేశాల మేరకు రైతాంగానికి నష్ట పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకున్నాం. ప్రస్తుతం రైతులు నారుమడులు, వరినాట్ల పొలాల్లోని నీటిని తొలగించి రక్షణ చర్యలు చేపట్టాలి.

లోతట్టు ప్రాంత ప్రజలు..
సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలి
అధికారులను అప్రమత్తం చేసిన జిల్లా కలెక్టర్ నాగరాణి


ప్రజాశక్తి - భీమవరం



ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు, శిథిలావస్థలో ఉన్న భవనాలు, గుడిసెలు, షెడ్లలో నివసిస్తున్న ప్రజలు తక్షణం సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ రాజ్ శాఖాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి డ్రెయిన్లలో నీటిపారుదలకు అడ్డంకులు లేకుండా సిబ్బందితో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. యుద్ధ ప్రాతిపదికన డ్రెయిన్ల ద్వారా మురుగునీరు సాఫీగా ప్రవహించేలా శాశ్వత చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా అంటు వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు సురక్షితమైన తాగునీరందించడమే కాకుండా, మెరుగైన శానిటేషన్ పక్కాగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లా అధికారులను గురువారం కలెక్టర్ అప్రమత్తం చేశారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, మున్సిపల్, ఆరోగ్యశాఖ, ఆర్డబ్ల్యుఎస్ అధికారులు సమన్వయంతో శానిటేషన్, బ్లీచింగ్, శుద్ధిచేసిన తాగునీరు సరఫరాకు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డయేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులు విస్తరించకుండా ఆరోగ్యశాఖ అధికారులు ఇంటింటికీ వెళ్లి వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ అవసరం మేరకు మందులు అందించాలని సూచించారు. రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు కాలువ గట్లు, డ్రెయిన్లు, గోదావరి గట్లు పర్యవేక్షించాలని, గండ్లు పడే అవకాశం ఉంటే ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

వాటర్ వర్క్స్లో మంత్రి నిమ్మల తనిఖీలు

ప్రజాశక్తి - పాలకొల్లు



వాటర్ వర్క్సను ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లు వాటర్ వర్క్సను జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం జోరువర్షంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని విభాగాలను పరిశీలించారు. పట్టణంలో తాగునీరు నాణ్యంగా లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, 15 రోజుల్లో మరోసారి వస్తానని, ఈలోపు ఎటువంటి ఫిర్యాదులూ రాకూడదని మున్సిపల్ ఇంజినీర్లను హెచ్చరించారు. జిల్లాలో పాలకొల్లు తాగునీరు అంటే ఎంతో ప్రాముఖ్యత ఉందని, దానిని నిలబెట్టాలని కోరారు. తాగునీటి కేంద్రం పర్యవేక్షణకు ఇరువురు సచివాలయ సిబ్బందిని నియమించినట్లు మున్సిపల్ కమిషనర్ విజయసారధి చెప్పారు. జనరేటర్ వద్ద డీజిల్పై ఫిర్యాదులు వస్తున్నాయని, ఇవి జరగకుండా ఉండాలంటే సీసీ కెమెరాలు పెట్టాలని మంత్రి సూచించారు. మంత్రి వెంట మాజీ ఎంఎల్సి అంగర రామ్మోహన్, మున్సిపల్ ఇంజినీర్లు కె.రాజ్కుమార్, సాంబశివుడు, టిడిపి నేతలు పెచ్చెట్టి బాబు, కర్నేన రోజారమణి, జివి, కర్నేన గౌరునాయుడు, వల్లభు శ్రీనివాస్ ఉన్నారు.

పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో మంత్రి సమీక్ష

జగన్ అమరావతి, పోలవరానికే పరిమితం కాకుండా అన్ని ప్రాంతాల్లో ప్రాజెక్టులను సర్వనాశనం చేశారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. మంత్రి పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యులతో మంత్రి సమీక్షించారు. నూతన భవనంలో కనీసం కొన్ని గదులు, ఆపరేషన్ థియేటర్ అయినా నెల రోజుల్లో రోగులకు అందుబాటులో ఉంచాలని ఇంజినీరింగ్ అధికారులను కోరారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మీడియాతో మాట్లాడుతూ పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో నూతన భవన నిర్మాణానికి టిడిపి హయాంలో రూ.12.5 కోట్లు మంజూరు చేశామన్నారు. అయితే కేవలం రూ.9.5 కోట్లకు డిజైన్ చేశారని, వంద పడకలకు మంజూరు చేస్తే 50 పడకలకు మాత్రమే డిజైన్ చేశారని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దీంతో పెరుగుతున్న రోగుల సంఖ్యకు అణుగుణంగా సౌకర్యాలు పెరగలేదన్నారు. ముఖ్యమైన విభాగాలకు గదుల్లేవని చెప్పారు. సమీక్షలో సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్, డాక్టర్లు వర్మ, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని వర్షం.. జనజీవనం అస్తవ్యస్తం



నరసాపురం : కూలిన తాటాకిల్లు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఎడతెరిపి లేకుండా గురువారం తెల్లవారుజాము నుంచి వర్షం కురుస్తుండటంతో పట్టణంలోని పల్లపు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. పలు వీధులు, ప్రధాన రోడ్లు సైతం జలమయమయ్యాయి. దీంతో ఉద్యోగాలకు వెళ్లే వాళ్లు, చిరువ్యాపారులు, స్కూల్కు వెళ్లే విద్యార్థుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఒకటో వార్డులోని వీకర్స్ కాలనీ, మసీదు రోడ్డు, శేషమహల్ రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు, గొల్లగూడెం సెంటర్, కడకట్ల, యాగర్లపల్లి, తాలూకాఫీస్ ప్రాంగణం, జెడ్పి పాఠశాల ఆవరణ, కడకట్ల కోడే వెంకట్రావు పాఠశాల ఆర్టిసి ప్రాంగణంలో వర్షపు నీటితో మునిగాయి.

నరసాపురం : భారీ వర్షాలకు చామకూరిపాలెంలోని బొక్కా సురేష్కు చెందిన తాటాకిల్లు కూలిపోయింది. సురేష్ తండ్రి ఏడుకొండలు చనిపోవడంతో వారు కొన్ని నెలలుగా వేరే ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. ఇల్లు కూలిన సమయంలో లోపల ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆ ఇంటి మట్టిగోడలు నానిపోయి కూలినట్లు గుర్తించారు. ఆ ప్రాంతంలో వ్యవసాయ పనులు చేసుకుంటున్న కవురు పెద్దిరాజు తృటిలో ప్రమాదం నుంచి తప్పుకున్నారు.

ఆచంట: గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆచంట పరిసర గ్రామాల్లో వర్షం కురుస్తూనే ఉంది. భారీ వర్షాల కారణంగా పలు కాలనీల్లో నీరు చేరింది. వర్షపు నీరు రహదారులపైనే నిలిచిపోయింది. కాలనీల నుంచి వర్షపు నీరు బయటకు పారకపోవడంతో అక్కడి ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఆచంట పెదపేట, కొడమంచిలి పంచాయతీ పరిధి చినపేట, తురకవానిమెరక, వేమవరం పంచాయతీ పరిధి పసలపేట, కరుగోరుమిల్లి పంచాయతీ కాలనీల్లో ఈ పరిస్థితి తలెత్తింది. మురుగునీటికి దోమలు స్వైరవిహారం చేస్తుండటంతో కాలనీవాసులు తరుచూ రోగాలబారిన పడుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి దళితవాడ కాలనీలో పక్కాడ్రెయిన్లు ఏర్పాటు చేయాలని ఆయా కాలనీవాసులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

పాలకొల్లు: గురువారం ఉదయం నుంచి పట్టణంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో జనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. అత్యవసర పనులున్న జనం మాత్రమే బయటకు వచ్చారు. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. వర్షం కారణంగా వ్యాపారాలు లేక కొందరు దుకాణాలు మూసివేశారు. నాట్లు వేయాల్సిన పొలాల్లో నారుమళ్లు మునిగి పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



పాలకొల్లులో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

ఆకివీడు: ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో వరి రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మండలంలో సుమారు ఐదు వేల ఎకరాల్లో సాగుకు వరి రైతులు సిద్ధమవ్వగా నారుమళ్లు, నాట్లకు సిద్ధం చేసిన పొలాలు నీట మునిగాయి. దీంతో నారు కుళ్లిపోతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం ఆగితే నారును రక్షించుకోవచ్చని చెబుతున్నారు. భారీ వర్షాల కారణంగా మునిగిన వరి చేలను వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు, ఎఒ ప్రియాంక కలిసి గురువారం పరిశీలించారు.



ఆచంట : ఇళ్ల చుట్టూ వర్షపు నీరు

మొగల్తూరు: మండలంలోని గ్రామాల్లో గురువారం తెల్లవారుజాము నుండి వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

పెనుమంత్ర : మండలంలో గురువారం ఉదయం నుండి విడవకుండా కురుస్తున్న వర్షానికి పల్లపు ప్రాంతాల్లోని పొలాల్లోకి నీరు చేరి నారుమడులు, నాట్లు నీట మునిగాయి. నాట్లు పూర్తయిన పొలాలు చెరువుల్లా మారడంపై స్థానిక రైతులు ఆందోళన చెందుతున్నారు.

భీమవరం: అల్పపీడన ప్రభావంతో జిల్లావ్యాప్తంగా సరాసరి వర్షపాతం 41.6 మిల్లీమీటర్లుగా నమోదైంది. అత్యధికంగా తాడేపల్లిగూడెంలో 95.8 మిల్లీమీటర్లు, అత్యల్పంగా యలమంచిలిలో 20.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. పెనుమంత్రలో 30.2, పెనుగొండలో 32.4, ఆచంటలో 30, పోడూరులో 29.4, మొగల్తూరులో 34.6, నరసాపురంలో 54.6, పాలకొల్లులో 62.2, గణపవరంలో 31.6, ఆకివీడులో 33, ఉండిలో 48.2, పాలకోడేరులో 45.2, వీరవాసరంలో 31.4, భీమవరంలో 50.4, కాళ్లలో 25.2, పెంటపాడులో 71.6, తణుకులో 25.4, అత్తిలిలో 33.2, ఇరగవరంలో 46.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గురువారం ఉదయం 8:30 గంటల నుండి సాయంత్రం 5:30 గంటల వరకు నమోదైన వర్షపాతం వివరాలు ఇవని అధికారులు తెలిపారు.



ధర్నా చేస్తున్న మత్స్యకారులు

మత్స్యకారులకు రూ.20 వేల భృతి ఇవ్వాలి

ప్రజాశక్తి - నరసాపురం

చేపల వేట నిషేధం సమయంలో మత్స్యకారులకు ఇచ్చే భృతి రూ.20 వేలు ఇవ్వాలని కోరుతూ పెదమైనవానిలంకలో మత్స్యకారులు మత్స్యకార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా కార్యదర్శి జల్లి రామ్మోహన్రావు మాట్లాడుతూ మాట్లాడుతూ చేపల వేటనే నమ్ముకుని జీవిస్తున్న మత్స్యకారులను ప్రభుత్వాలు ఎల్లప్పుడూ చిన్నచూపు చూస్తూనే ఉన్నాయన్నారు. ప్రభుత్వం రెండు నెలలకు సరిపడే నిత్యావసర వస్తువులు చౌక దుకాణం ద్వారా అందించాలన్నారు. పెన్షన్ తీసుకున్న మత్స్యకారుడు వేటకు వెళ్తే ఆ వేటగానికి వేట నిషేధ భృతి ఇవ్వాలన్నారు. ఆయిల్ సబ్సిడీని రూ.20 పెంచి బోటు యజమాని ఖాతాలో నేరుగా జమ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమాని రామారావు, కొక్కిరిగడ్డ నాగవెంకటేశ్వర్లు, పొన్నమండ ధర్మరాజు, పొన్నమండ శ్రీను, పోతాబత్తుల లక్ష్మయ్య, తిరుమాని గోవిందరాజు, తిరమాని అర్జునరావు, తిరుమాని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నరసాపురంలో ఇఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేస్తాం


రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురంలో ఇఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుక మాఫియాకు పాల్పడిన అధికారులను, దళారులను విడిచిపెట్టేది లేదని హెచ్చరించారు. జగన్ పాలనలో కార్మిక శాఖలోనే సుమారు మూడు వేల కోట్లు దారిమళ్లినట్లు గుర్తించామన్నారు. కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు మంత్రి చెప్పారు. త్వరలో నరసాపురంలో ఇఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటుకు శుక్రవారం కార్మిక శాఖాధికారులు నరసాపురంలో ఎంఎల్ఎ నాయకర్తో సమావేశమవుతారన్నారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు.



మంత్రి సుభాష్ కు వినతిపత్రాన్ని అందిస్తున్న కార్మికులు



ఎంఎల్ఎ అంజిబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు లారెన్స్ కుమారి, వరలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులుకు ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు లారెన్స్ కుమారి, వరలక్ష్మి మాట్లాడుతూ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా రాష్ట్రంలోని ఎంఎల్ఎలందరికీ వినతి పత్రాలు అందించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే భీమవరం ఎంఎల్ఎ రామాంజనేయులుకు అందజేశామని తెలిపారు. కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని గతంలో చేసిన ఆందోళన ఫలితంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను మినిట్స్ కాపీని కూడా ఎమ్మెల్యేకు అందజేశామన్నారు. ప్రసూతి సెలవులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు కావడం లేదని, చివరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా ఇవ్వడం లేదని తెలిపారు. సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సిఐటియు జిల్లా నాయకులు బి.వాసుదేవరావు మాట్లాడుతూ ఆశా వర్కర్లు చాలా కాలంగా ప్రజలకు వివిధ రకాల సేవలందిస్తున్నారని తెలిపారు. వారి సమస్యల పరిష్కారానికి సత్వరం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం.ఆంజనేయులు, యూనియన్ నాయకులు రాజేశ్వరి, నిర్మల, దుర్గ, సంతోష్ వాణి, కుమారి పాల్గొన్నారు.

కోస్టల్ జోన్ మేనేజ్మెంట్ అమలుకు సహకరించాలి


జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - నరసాపురం



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

పర్యావరణాన్ని కాపాడుకునేందుకు కోస్టల్ జోన్ మేనేజ్మెంట్ ప్లాన్ అమలుకు అందరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణా మండలి ఏలూరు ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో గురువారం సబ్కలెక్టర్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కోస్టల్ జోన్ మేనేజ్మెంట్ ప్లాన్ (సిజెడ్ ఎంపీ) ఖరారు కోసం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ కోస్టల్ రెగ్యులేటరీ జోన్ (సిఆర్జెడ్) నోటిఫికేషన్, 2019 ప్రకారం జిల్లా కోస్టల్ జోన్ మేనేజ్మెంట్ ప్లాన్ (సిజెడ్ ఎంపీ) తయారు చేసినట్లు తెలిపారు. తీరప్రాంతాల్లోని మత్స్యకార సంఘాలు, ఇతర స్థానిక వర్గాలకు జీవనోపాధి భద్రతతో పాటు, తీరప్రాంతాలు, సహజ ప్రమాదాలను పరిగణనలోకి తీసుకుని శాస్త్రీయ సూత్రాల ఆధారంగా స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదాలు, గ్లోబల్ వార్మింగ్ కారణంగా సముద్ర మట్టం పెరుగుదలను అదుపు చేయడం ఈ నోటిఫికేషన్ లక్ష్యమన్నారు. కోస్టల్ జోన్ మేనేజ్మెంట్ ప్లాన్ల తయారీ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం, పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ వారు చెన్నయ్ నేషనల్ సెంటర్ ఫర్ సస్టైనబుల్ కోస్టల్ మేనేజ్మెంట్ వారి ద్వారా రూపొందించడం జరిగిందన్నారు. పర్యావరణాన్ని కాపాడుకునేందుకు కొత్త పరిశ్రమల ఏర్పాటు, ఇప్పటికే ఉన్న పరిశ్రమలు, కార్యకలాపాలు లేదా ప్రక్రియల విస్తరణ సిఆర్జెడ్ లోపల నిషేధించబడిన కార్యకలాపాలుగా ఉన్నాయన్నారు. దేశ తీర ప్రాంత పర్యావరణాన్ని పరిరక్షించడానికి తీర ప్రాంతాల మడఅడవుల నియంత్రణ కీలకమన్నారు. పారిశ్రామిక అభివృద్ధి, కొత్త మౌలిక సదుపాయాలు, ప్రాజెక్టులు మడ అడవుల పర్యావరణ వ్యవస్థకు ముంపుగా పరిగణించ బడుతున్నాయన్నారు. ఇది స్థానిక జనాభా జీవనాధారాలపై ప్రభావం చూపుతోందన్నారు. ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ పేరుపాలెం బీచ్ టూరిజంగా అభివృద్ధి చేస్తే నియోజకవర్గంలోని చుట్టుపక్కల గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ పరిశ్రమల ద్వారా వచ్చే విషవాయువులు వర్థాలు గోదావరిలో, కాలువల్లో కలవడం వల్ల అనేక అనర్థాలు జరుగుతున్నాయని తెలిపారు. తీరప్రాంతాన్ని మనం కాపాడుకోవాలన్నారు. టూరిజం రీజినల్ డైరెక్టర్ పి.స్వామి నాయుడు మాట్లాడుతూ పేరుపాలెం, కెపి.పాలెం, బీచ్లతోపాటు కనకదుర్గ బీచ్, మొల్లపర్రు బీచ్, పిఎం లంక బీచ్, వేములదీవి బీచ్ కూడా సిఆర్జెడ్ పరిధిలోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డిఒ అచ్యుత అంబరీష్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.వెంకటేశ్వరరావు, ఎసి జెడ్ ఎంఎ విజయవాడ ఎస్కె.సుభాన్, ఎన్సిఎస్ఇఎం చెన్నయ్ యోగరాజు, జిల్లా మత్స్య శాఖ అధికారి ఎన్విఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.


రఘురామకృష్ణంరాజుకు సమస్యలు వివరిస్తున్న ఆక్వా రైతులు

ఆక్వారంగం అభివృద్ధికి కృషి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - కాళ్ల


ఆక్వారంగ అభివృద్ధికి కృషి చేస్తామని ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణం రాజు అన్నారు. పెదఅమిరంలో జై భారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం సభ్యులు రఘురామకృష్ణంరాజు గురువారం కలిశారు. ఆక్వా రైతుల సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందజేశారు. సమస్యలపై వారితో చర్చించి త్వరగా పరిష్కరిస్తానని, ఆక్వారంగ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్ని శాఖలకు సంబంధించిన అధికారులూ విధి విధానాల్లో సంసిద్ధంగా ఉండాలని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో మున్సిపల్ కార్యాలయంలో శానిటేషన్ సిబ్బందితో ఆయన అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టం జరిగే వరకూ వేచి చూడకుండా ముందుగానే చర్యలు తీసుకునే విధంగా అన్ని శాఖల అధికారులూ మూడు రోజులపాటు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. నీరు నిలిచిన చోట అడ్డంకిగా ఉన్న ఎటువంటి నిర్మాణాలైనా తొలగించి సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ఎలక్ట్రికల్ ఎడిఇతో పాటు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్, రెవెన్యూ, ఇరిగేషన్, తదితర అధికారులతో ఆయన ఫోన్లో మాట్లాడారు. ఏలూరు కాలువకు సంబంధించి విజ్జేశ్వరం వద్ద నుండి నీటి విడుదల తగ్గించాలని అధికారులకు సూచించారు. అధికారులు ఎవరైనా సెలవులో ఉంటే వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించారు. ఎర్రకాలువ పరివాహక ప్రాంతాల్లో రైతులను ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.


ఎంఎల్ఎకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

షెడ్డు ఏర్పాటుకు స్థలం కేటాయించాలని వినతి

ప్రజాశక్తి - తణుకు

పట్టణంలో పాత ఇనుప సామగ్రి లోడింగ్ కార్మికులకు షెడ్డు నిర్మించేందుకు స్థలం ఇప్పించాలని శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణను గురువారం కార్మికులు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకూ వేల్పూరు రోడ్డులోని కప్పల వెంకన్న సెంటర్లో పని దొరికే వరకూ రోడ్లపైన, షాపుల వద్ద కూర్చుంటున్నామని తెలిపారు. లారీ వచ్చిన వెంటనే లారీపై వెళ్లాలని, అలాంటప్పుడు తమ సైకిళ్లు, మోటారు సైకిళ్లు ఎక్కడ పెట్టాలో తెలియడం లేదని తెలిపారు. ఎంఎల్ఎ రాధాకృష్ణ సానుకూలంగా స్పందించి అధికారులతో మాట్లాడి స్థలం ఏర్పాటు చేసే విధంగా బాధ్యత తీసుకుంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

పార్టీలకతీతంగా గ్రామాల అభివృద్ధికి సహకరించాలని మండల పరిషత్ అధ్యక్షులు కర్రి వెంకటనారాయణరెడ్డి (వాసు రెడ్డి) ఎంఎల్ఎ పితాని సత్యనారాయణను కోరారు. గురువారం ఎంపిపి బృందం ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఆచంట నియోజకవర్గం నుంచి మంచి మెజార్టీతో ఎంఎల్ఎగా ఎంపికైన సందర్భంగా పితాని సత్యనారాయణను పెనుమంట్ర మండలం ఎంపిపి, వైస్ ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, అభినందించారు.

అందరినీ కలుపుకోవడమే తన లక్ష్యం..

ఎన్నికల్లో ఎవరి పార్టీకి వారు ఓట్లు వేస్తారని గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులను కలుపుకుంటూ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలన్నది తన లక్ష్యమని పితాని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడు కర్రి వెంకట నారాయణ రెడ్డి (వాసు), మండల పరిషత్ ఉపాధ్యక్షులు-1 వాసంశెట్టి కిరణ్ పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని ప్రదర్శించేలా చూడాలి

ప్రజాశక్తి - కాళ్ల

పిల్లలు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించేలా తల్లిదండ్రులు చూడాలని ఐసిడిఎస్ కాళ్ల సెక్టార్ సూపర్‌వైజర్ కె.సూర్యకుమారి అన్నారు. పెదమిరం గ్రామంలో మిషన్ శక్తి 100 డేస్ స్పెషల్ ఎవేర్‌నెస్ ప్రోగ్రామ్‌లో మిషన్ స్కీమ్స్ గురించి గురువారం అవగాహన కల్పించారు. పుట్టిన 21 రోజుల్లో డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ తీసుకొని వెంటనే ఆధార్ తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌శాడీ టీచర్లు, పిల్లలు పాల్గొన్నారు.

35 మందికి రక్త పరీక్షలు

ప్రజాశక్తి - తణుకు

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి నెలా 3వ గురువారం సంఘం అధ్యక్షులు అల్లూరి కరుణాకర చౌదరి ఆధ్వర్యంలో స్థానిక సంఘం కార్యాలయంలో రక్త పరీక్షలు నిర్వహించారు. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 11.30 వరకూ సాయి శ్రీశ్వేత డయాగ్నస్టిక్ లాబ్ ద్వారా సుమారు 35 మందికి రక్త పరీక్షలు నిర్వహించి రిపోర్టులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పెనుమర్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

బాధితులకు చెక్కులు అందజేత

ప్రజాశక్తి - నరసాపురం

స్థానిక జనసేన కార్యాలయంలో గురువారం గతేడాది జనసేన క్రియాశీల సభ్యత్వం తీసుకుని ప్రమాదానికి గురైన బాధితులకు ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ చెక్కులు పంపిణీ చేశారు. నియోజకవర్గానికి చెందిన తోట మణికంఠకు రూ.27,147, రచ్చపోతుల నాగప్రవీణ్‌కు రూ.42,500, కాసా ఏసురాజుకు రూ.15,077 చెక్కులను ఎంఎల్ఎ అందజేశారు. పార్టీలకతీతంగా గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులోని బిఆర్ఎంవి మున్సిపల్ హైస్కూల్ వద్ద టీచ్ టూల్ అబ్జర్వర్స్ ట్రెయినింగ్ మూడో విడత గురువారం ప్రారంభమైంది. ఈ నెల 27వ తేదీ వరకూ ప్రొసీడింగ్స్‌లో ఇచ్చిన విధంగా జరుగుతాయని ఎంఇఒ గుమ్మళ్ల వీరాస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు, పోడూరు, యలమంచిలి, మొగల్తూరు, నరసాపురం, ఆచంట 6 మండలాల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు 105 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోర్సు కోఆర్డినేటర్ వీరస్వామి మాట్లాడారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రెయినర్స్ కె.లక్ష్మీనగేష్, వి.లక్ష్మీనారాయణ, సీనియర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు గాంధర్వ మహల్ శతవసంత వేడుకలు

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట జమిందారీ కుటుంబానికి చెందిన గొడవర్తి నాగేశ్వరరావు 1924లో గాంధర్వ మహల్‌ను అతి సుందరంగా నిర్మించారు. ఈ మహల్ నిర్మాణం కోసం బర్మా దేశం నుంచి టేకు కలప, బెల్జియం అద్దాలు, లండన్ నుంచి ఇనుప గడ్డర్లు, ఫియోనా, లండన్ నుంచి దిగుమతి చేసుకోవడం జరిగిందన్నారు. ఆ కాలంలో కరెంటు లేని సమయంలో ఈ గాంధర్వ మహల్‌కు కరెంటు సదుపాయం కల్పించి ఈ మహల్‌ను అత్యంత సుందరంగా నిర్మించారు. ఈ గాంధర్వ మహల్ చూపర్లను ఎంతగానో ఆకట్టుకుంటోంది. 2024 నాటికి శత వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ గాంధర్వ మహల్‌ను ఇటీవల రూ.20 లక్షలతో పునరుద్ధరించారు. శుక్రవారం మధ్యాహ్నం నాలుగు గంటలకు వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని టిడిపి సీనియర్ నాయకులు గొడవర్తి శ్రీరాములు తెలిపారు.


గాంధర్వ మహల్

నీటి కాలుష్యాన్ని అరికట్టాల్సిన బాధ్యత అందరిదీ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం


గోదావరి జలాలు, సముద్రతీర ప్రాంతాల్లో నీటి కాలుష్యాన్ని అరికట్టాల్సిన బాధ్యత ప్రజలందరిపైనా ఉందని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం నరసాపురంలో జిల్లా కలెక్టర్ నాగరాణి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కోస్టల్ జోన్ మేనేజ్మెంట్ అథారిటీ, కాలుష్య నియంత్రణ మండలి సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సముద్రతీర ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధికి ఆటంకం కాకూడదన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో సమస్యలపై ఆయన వాతావరణ, పర్యావరణ మంత్రిత్వ శాఖల అధికారుల దృష్టికి పలు సమస్యలు తీసుకెళ్లారు. తాడేపల్లిగూడెంలో మురుగునీరు పోవడానికి అవుట్‌లెట్ లేకపోవడంతో గోదావరి జలాలతో ప్రవహించే ఏలూరు కాలువలోకి వ్యర్థాలు కలుస్తున్నాయని, సమస్య పరిష్కారానికి సహాయ సహకారాలు అందించాలని ఆయన అధికారులను కోరారు. ఎప్పటి నుంచో అపరిష్కృతంగా ఉన్న తాడేపల్లిగూడెం మున్సిపాల్టీ అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పున:ప్రారంభించి మురుగునీరు నల్లజర్ల రోడ్డులో ఉన్న మురుగు కాలువకు అనుసంధానం చేసే దిశగా యాక్షన్ ప్లాన్ రూపొందించామని చెప్పారు.


మాట్లాడుతున్న ఎంఎల్ఎ శ్రీనివాస్

ప్రజాసేవే లయన్స్ లక్ష్యం

ప్రజాశక్తి - గణపవరం

పేదలకు సేవ చేయడమే లయన్స్ క్లబ్ లక్ష్యమని క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ పి.సుభాష్‌బాబు అన్నారు. బుధవారం రాత్రి సరిపల్లిలోని లయన్స్ క్లబ్ భవనంలో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి గణపవరం లయన్స్ క్లబ్ అధ్యక్షులు రావూరి నాగరాజు అధ్యక్షత వహించారు. సభలో పాల్గొన్న సుభాష్ బాబు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా చేస్తున్న సేవల వల్ల క్లబ్ సభ్యులు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పడతారన్నారు. క్లబ్ సేవలు మరింత విస్తత స్థాయిలో జరగాలంటే ప్రతి క్లబ్‌లో సభ్యులను అధిక సంఖ్యలో చేర్చాల్సిన అవసరం ఉందన్నారు. క్లబ్ మాజీ గవర్నర్ ఈపూరి సత్యనారాయణ మాట్లాడుతూ సేవా కార్యక్రమాల వల్ల క్లబ్‌కు మంచి పేరు ప్రఖ్యాతలు కలుగుతున్నట్లు చెప్పారు. అనంతరం 2024-25 సంవత్సరానికి గాను నూతన కమిటీ ప్రమాణస్వీకారం చేసింది. క్లబ్ నూతన అధ్యక్షులుగా పచ్చిపులుసు నాగేశ్వరరావు, కార్యదర్శిగా ఎస్.వెంకటేశ్వరరావు (నాని), కోశాధికారిగా కెఎన్.విశారద ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రీజియన్ ఛైర్‌పర్సన్ జి.కృష్ణమూర్తి, జోన్ ఛైర్‌పర్సన్ పోశింశెట్టి రామ్మూర్తి, మెంబర్షిప్ ఛైర్ పర్సన్ కిలారి రవిబాబు పాల్గొన్నారు.



లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులను సత్కరిస్తున్న సభ్యులు

కిశోర బాలికలకు అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - ఆచంట

కిశోర బాలికలు విధిగా పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీనతకు గురికాకుండా ఉంటారని భీమవరం జిల్లా మహిళా శిశుసంక్షేమ సాధికారిక అభివృద్ధి అధికారి బి.సుజాతరాణి అన్నారు. వంద రోజుల పౌష్టికాహారం, రక్తహీనత సంరక్షణ, చట్టాలు, హక్కులుపై స్థానిక ఎంవిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కిశోర బాలికలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుజాతారాణి మాట్లాడుతూ కిశోర బాలికలు పౌష్టికాహారాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళల్లో రక్తహీనత వంటి సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఒకవైపు తక్కువ బరువు, బక్క పలచన దేహాలతో బాధపడుతున్న వారి సంఖ్య ఆందోళన కలిగిస్తుండగా, మరోవైపు అధిక బరువు కూడా చిన్నారులను వేధిస్తున్న సమస్యగా ఉందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నివసించే నిరుపేద చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు సకాలంలో పౌష్టికాహారం అందించేందుకు అంగన్వాడీల ద్వారా ప్రభుత్వం సకల సౌకర్యాలూ ఏర్పాటు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సిడిపిఒ ఎ.కృష్ణకుమారి, ఎంఇఒ ఉషారాణి, సూపర్‌వైజర్ శ్యామలాంబ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గణపవరం : గురువారం సిహెచ్ అగ్రహారంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో తల్లులకు బాలికల సంరక్షణ, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ పిప్పర సెక్టార్ సూపర్‌వైజర్ సిహెచ్ దుర్గాభవాని మాట్లాడుతూ బాల్య వివాహాలు వల్ల వచ్చే ఇబ్బందులను వారికి వివరించారు. పంచాయతీ కార్యదర్శి పి.స్రవంతి మాట్లాడుతూ గ్రామంలో బాల్య వివాహాలు జరిగితే వెంటనే తెలియపర్చాలని తెలిపారు. కార్యక్రమంలో ఎఎన్ఎం ఎం.ఏసుమణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ మహేశ్వరరావు

మొగల్తూరులో అన్నదానం

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని కోట రోడ్డులో ఉన్న దత్తసాయి మందిరంలో గురువారం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. యాత్రికులు బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. సమారాధనలో పాల్గొన్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలూ కలగకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

జనసేన సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలో జనసేన కార్యాలయంలో పార్టీ నాలుగో విడత క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నాయకర్ మాట్లాడుతూ జనసేన నాయకులకు, కార్యకర్తలకు క్రియాశీలక సభ్యత్వం వారి కుటుంబాలకు ఎంతో క్షేమదాయకమని అన్నారు. సభ్యత్వం తీసుకున్న జన సైనికులకు, నాయకులకు 5 లక్షల రూపాయలు ఇన్సూరెన్స్‌తో పాటు ఏదైనా ప్రమాదం సంభవిస్తే హాస్పిటల్ ఖర్చులకు రూ.50 వేలు అందజేస్తారని తెలిపారు. నియోజవర్గంలో ఇప్పటికే 5000 సభ్యత్వాల నమోదు జరిగిందన్నారు. అనంతరం ప్రమాదాల బారినపడిన బాధిత కుటుంబాలకు చెక్కులు పంపిణీ చేశారు.

ముత్యాలమ్మ సన్నిధిలో మంత్రి సుభాష్

ప్రజాశక్తి - మొగల్తూరు

ముత్యాలపల్లి గ్రామంలో బండి ముత్యాలమ్మను కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం దర్శించుకున్నారు. అమరావతి నుండి నరసాపురం వెళ్తూ అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి శ్వేతవస్త్రం, ప్రసాదాన్ని ఆలయ అర్చకులు అందించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి - ఉండి

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సిడిపిఒ వాణి విజయరత్నం తెలిపారు. యండగండి సెక్టార్ పరిధిలోని యండగండి-1 అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సిడిపిఒ వాణి విజయరత్నం ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ వాణి విజయరత్నం మాట్లాడుతూ ఆడపిల్లలకు 18 సంవత్సరాలు, మగ పిల్లలకు 21 సంవత్సరాలు నిండకుండా వివాహం చేయకూడదని తెలిపారు. పేదరికం, నిరక్షరాస్యత వల్ల బాల్య వివాహాలపై అవగాహన లేకపోవడం వల్ల ఇలా జరుగుతోందన్నారు. అనాధ బాలలు లింగ వివక్షత కుటుంబంలో అనారోగ్యం సమస్యలు, సంప్రదాయాలు, ఆచారాలు వల్ల బాల్య వివాహాలు జరగకుండా చూడాలని తెలిపారు. బాల్య వివాహాలు జరిగితే ఉమెన్ హెల్ప్ లైన్ 181కు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నిర్మల, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎను కలిసి మార్టేరు ఫారం ఎడిఆర్

ప్రజాశక్తి - పెనుమంట్ర

తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రగతిని వివరించామని స్థానిక ఫారం ఎడిఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మార్టేరు ప్రాంతీయ పరిశోధనా స్థానంలో జరిగే పరిశోధనా వివరాలు, ఇతర కార్యక్రమాల గురించి ఎంఎల్ఎకు వివరించామని తెలిపారు. రాబోయే శత వసంత వేడుకలకు ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందించాలని కోరామని పేర్కొన్నారు. పరిశోధనా స్థానంలో కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు పూర్తి సహకారం అందిస్తామని ఎంఎల్ఎ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

సురేష్‌కు మంత్రి, ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు పంచాయతీ పరిధి పడమటి పాలెం గ్రామానికి చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి పడాల సురేష్‌ను మంత్రి నిమ్మల రామానాయుడు, శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ గురువారం పరామర్శించారు. ఇటీవల సురేష్ పెదనాన్న పడాల వెంకట సత్యనారాయణ మృతి చెందారు. ఈ మేరకు సత్యనారాయణ కుటుంబ సభ్యులను, సురేష్‌ను వారు పరామర్శించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

స్పర్శలేని మచ్చలను అశ్రద్ధచేయొద్దు

డిఎంహెచ్ఒ మహేశ్వరరావు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

శరీరంపై స్పర్శ లేని రాగి, రంగు మచ్చలను అశ్రద్ధ చేయొద్దని డిఎంహెచ్ఒ డి.మహేశ్వరరావు తెలిపారు. లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని దగ్గులూరు సచివాలయం ఏరియాలో లెప్రసీపై జరుగుతున్న సర్వేను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మహేశ్వరరావు మాట్లాడారు. ఈ సర్వే 18వ తేదీ నుంచి ఆగస్టు రెండో తేదీ వరకూ జరుగుతుందన్నారు. ఇంట్లో ఎవరికైనా స్పర్శ లేని రాగి, రంగు మచ్చలు ఉన్నా, మచ్చలపై వెంట్రుకలు లేకపోయినా తదితర లక్షణాలు ఉన్నా అశ్రద్ధ చేయొద్దని తెలిపారు. వాలంటీర్ గానీ, ఆశా కార్యకర్తగానీ, గుర్తించిన మచ్చలను తదుపరి ఎఎన్ఎంలు, ఎల్ హెచ్ పిలు డిప్యూటీ పారామెడికల్ అధికారి నిర్ధారించి ఆరు నెలలు చికిత్స ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్, డాక్టర్ నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పిహెచ్ఎన్ పి.ఎలిజిబెత్, ఫార్మసిస్ట్ పాల్గొన్నారు.

ఆస్పత్రి పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎంఎల్ఎ రాధాకృష్ణకు వినతి

ప్రజాశక్తి - తణుకు

తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల పిఎఫ్ ఖాతాల్లో సొమ్ము జమ చేయకుండా కార్మికులకు ద్రోహం చేస్తున్న ఫస్ట్ అబ్జెక్ట్ ప్రయివేటు లిమిటెడ్ కాంట్రాక్టు ఏజెన్సీని బ్లాక్ లిస్టులో పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకుని కార్మికులకు న్యాయం చేయాలని ఎపి మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షులు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు డిమాండ్ చేశారు. గురువారం మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ గత మూడేళ్లుగా పిఎఫ్ సొమ్ము కార్మిక ఖాతాల్లో జమ చేయకుండా చట్టబద్ధమైన హక్కును ఉల్లంఘించిన కాంట్రాక్టు ఏజెన్సీ నిర్వాహకులను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. 150 పడకల తణుకు జిల్లా ఆసుపత్రి స్థాయి కనుగుణంగా పారిశుద్ధ్య కార్మికులను నియమించి పనిభారం తగ్గించాలని కోరారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ మెడికల్ కాంట్రాక్టు కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ కార్యదర్శి ధర్మాన పుష్పలత, మార్లపూడి వెంకటలక్ష్మి, పి.విజయలక్ష్మి, పి.రేణుక పాల్గొన్నారు.

'టార్గెట్ల పేరుతో విఆర్ఒలను ఇబ్బంది పెట్టొద్దు'

ప్రజాశక్తి - పెనుమంట్ర

గ్రామ రెవెన్యూ అధికారులను టార్గెట్ల పేరుతో అధికారులు ఇబ్బంది పెట్టడం తగదని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి.రవీంద్రరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు గురువారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్ల విషయంలో ఉన్న లోపాలను రెవెన్యూ మంత్రి దృష్టికి, సిసిఎల్ఎ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, కింద స్థాయిలో వాస్తవ పరిస్థితిని తెలుసుకోకుండా కావాలని ఇప్పటికీ విఆర్ఒలను టార్గెట్ల పేరుతో అధికారులు ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. ఏటా కౌలు కార్డుల విషయంలో ఏ ప్రభుత్వం వచ్చినా పర్సంటేజ్ పెంచేసి అది మండల స్థాయిలో విఆర్ఒలపై భారం పెట్టి టార్గెట్లు కంప్లీట్ చేయాలని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు ఆలోచించి మంచి నిర్ణయం తీసుకుంటే ప్రభుత్వానికి అన్ని రకాలుగా తోడ్పాటుగా ఉంటామని తెలిపారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం

ప్రజాశక్తి - నరసాపురం

హెల్మెట్‌లేని ప్రయాణం ప్రమాదకరమని అదనపు జిల్లా న్యాయమూర్తి పి.విజయదుర్గ అన్నారు. గురువారం పట్టణంలో అంబేద్కర్ సెంటర్ నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకూ నరసాపురం మండలం న్యాయ సేవధికార సంస్థ ఆధ్వర్యంలో వన్ కె వాక్, హెల్మెట్ ధరించాలంటూ అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి విజయదుర్గ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ వినియోగంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేస్తే ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడవచ్చన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల కొంత వరకూ ప్రాణాపాయం నుంచి కాపాడుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి గంగరాజు, జూనియర్ డివిజన్ సివిల్ న్యాయమూర్తులు ఆర్.వరలక్ష్మి, కె.శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్ దానయ్య నాయుడు పాల్గొన్నారు.

తణుకు:నిత్యం వందల ప్రమాదాలు జరుగుతున్నాయని, అందులో హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోయిన వారు ఎక్కువ మంది అని రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎవి నాగరాజు అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద హైకోర్టు ఆదేశాల మేరకు హెల్మెట్ ధరించడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి నాగరాజు మాట్లాడుతూ వాహనదారలుఉ హెల్మెట్ ధరించాలని తెలిపారు. కారు డ్రైవింగ్ చేసే వారు సీట్ బెల్ట్, బైక్ డ్రైవ్ చేసే వారు హెల్మెట్ విధిగా ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కృష్ణసత్యలత, సీనియర్ న్యాయవాది కౌరు వెంకటేశ్వరరావు, న్యాయవాది అజయ్‌కుమార్, టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎం.నాగరాజు పాల్గొన్నారు.